క్లుప్తంగా

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

శిరివెళ్ల: సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయని తహసీల్దార్ పుష్పకుమారి గురువారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 23వ తేదీన కేసీ కెనాల్, తెలుగు గంగ, చెరువుల సాగునీటి సంఘాల జరగాల్సిందన్నారు. అయితే ప్రభుత్వం వాటిని వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించాలో త్వరలో ప్రకటన వెలువడుతుందని చెప్పారు.

ప్రతి విద్యార్థికి గుర్తింపు నంబర్

శిరివెళ్ల: ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికి ఓ గుర్తింపు నంబర్ ఇవ్వడానికి కార్యాచరణ జరుగుతోందని ఎంఈఓ శంకరప్రసాదు తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న యూనిక్ నంబర్ అప్‌లోడ్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 1- 10వ తరగతి విద్యార్థి వరకు 12 నంబర్లతో కూడిన యూనిక్ నంబర్ కేటాయిస్తారని చెప్పారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో 90 శాతం, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల్లో 70 శాతం ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 903 మంది విద్యార్థులకు గాను 549 మంది విద్యార్థులకు చెందిన యూనిక్ నంబర్ కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని హెచ్ఎం విజయకుమార్ ఎంఈఓకు తెలిపారు.

120 మందికి కంటి పరీక్షలు

ఉయ్యాలవాడ : స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నంద్యాల పట్టణానికి చెందిన ఉదయానంద ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు సామ్యారెడ్డి గురువారం 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 38 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వీరికి నంద్యాల ఉదయానందకు రెఫర్ చేశామన్నారు. వీరందరికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని, అలాగే..ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. స్థానిక వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్, రమేష్, సిబ్బంది అశోక్ కుమార్, లక్ష్మి, షాకీర్ పాల్గొన్నారు.

రోడ్లను నాణ్యంగా నిర్మించండి



రుద్రవరంలో అధికారులతో మాట్లాడుతున్న ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ షణ్ముక్ కుమార్

రుద్రవరం: ఉపాధి హామీ పథకం నిధులతో వేసే సీసీ రోడ్లు నాణ్యంగా నిర్మించాలని ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ షణ్ముక్ కుమార్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద రూ.58 వేలతో నిర్మించిన రూఫ్ టాప్ స్ట్రక్చర్ (వర్షపు నీటిని ఇంకించే గుంత)ను గురువారం ఆయన పరిశీలించారు. పీడీ జనార్దన్‌రావు, ఏపీడీ సాంబశివరావు, స్థానిక సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓ మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం గ్రామంలో పల్లె పండుగ కింద వేసిన సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమా వేశం నిర్వహించి రాబోయే వేసవిలో ఉపాధి పథకం కింద చేపట్టాల్సిన పనులు,కూలీలకు పనులు కల్పించడం,పాం పాండ్స్ నిర్మాణాలు వంటి అంశాలపై చర్చించినట్లు ఏపీఓ ప్రతాప్ తెలిపారు.

ఎస్ఈని కలిసిన పీడీఈఏ కార్యవర్గం



ఎస్ఈ సుధాకర్‌కుమార్‌ను కలిసి అసోసియేషన్ నాయకులు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా పవర్ డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం నూతన ఎస్ఈగా సుధాకర్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కార్యదర్శి రామయ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జ్ఞాన సూర్యుడు, కోశాధికారి సుధాకర్, డివిజన్ కార్యదర్శి నాగరాజు, సుందర్‌రాజు ఎస్ఈని కలిసి అభినందనలు తెలిపారు.

డయాబెటిస్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ హరినాథరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ డయాబెటిస్ దినం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావుస్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు డయాబెటిస్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ హరినాథరెడ్డి, డాక్టర్ విజయబాబు అవగాహన కల్పించారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్ రావు, కళాశాల చైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

గోస్పాడు: మధుమేహ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధుమేహంతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువ అవుతుందన్నారు. అసంక్రమిత వ్యాధులు 3.0 సర్వే కింద మధుమేహ పరీక్ష కూడా చేస్తున్నట్లు తెలిపారు. వైద్యులు శారదాబాయి, కాంతరావునాయక్, అష్రాఫ్అలీ, శ్రీజా, భరత్‌కుమార్, చంద్రకాంత్, రమేష్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.



దొర్నిపాడు శివారులో నేలవాలిన వరి పైరు

అన్నదాతల్లో కలవరపాటు!

దొర్నిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రైతులను కలవర పెడుతోంది. గురువారం వర్షం కురవడంతో పొగాకు, వరి, కంది రైతులు ఆందోళన చెందారు. పొగాకు తోరణాలు కట్టే సమయంలో వర్షం రావడంతో రైతులు పొగాకును నేలపైనే అలాగే వదిలేశారు. ఈదురు గాలులకు చేతికి వచ్చిన వరి పైరు నేలవాలడంతో గింజలు రాలి తీవ్ర నష్టం చేకూరుస్తుంది. ఇప్పుడిప్పుడే వస్తున్న కంది పూతపై వర్షం ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.



క్రిష్టిపాడు వద్ద పొలంలోనే ఆరబెట్టిన పొగాకు

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): క్రీడా భారతి ఆధ్వర్యంలో జరుగుతున్న డబుల్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు గురువారం ముగిసినట్లు క్రీడా భారతి రాయలసీమ జోన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ తెలిపారు. అండర్-13 బాలికల డబుల్స్‌లో మొదటి బహుమతి ఆద్య, కన్విక, రెండో బహుమతి శ్రేష్ఠ, జాహిదా, లిప్షితా, అక్షర, అండర్-13 బాలురు డబుల్స్‌లో మొదటి బహుమతి అదిత్వత్, వివేక్, రెండో బహుమతి ఆదిత్య, చాకెతాన్, బెస్ట్ అప్రిసియేషన్ రుద్రా, కౌశిక్, అండర్-15 బాలికల డబుల్స్‌లో మొదటి బహుమతి మహీ, చైత్రిక, రెండో బహుమతి హరీనా, రీనా, బెస్ట్ అప్రిసియేషన్ అన్సరా, ఉజ్వల, అండర్-15 బాలురు డబుల్స్‌లో



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మొదటి బహుమతి సుమోత్, వివేక్, రెండో బహుమతి ఇంతియాజ్, గిస్వేర్, బెస్ట్ అప్రిసియేషన్ చేతన్, లోకేష్ నిలిచారన్నారు. విజేతలకు షేక్షావలి రెడ్డి బహుమతులు అందజేశారు. సుబ్బారెడ్డి, మహేశ్వరమ్మ, కోచ్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

భైరవగుండాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని భైరవగుండాల వద్దనున్న ప్రముఖ శైవక్షేత్రం భైరవేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశమున్నందున ఆలయ సమీపంలోనున్న తెలుగు గంట ప్రధాన కాల్వ వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ నిర్వాహకులు మునయ్య స్వామితో ప్రత్యేక పూజలు, కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. భైరవేశ్వర



తెలుగుగంగ కాలువను పరిశీలిస్తున్న డీఎస్పీ

స్వామి ఆలయాన్ని సందర్శించి, సమీపంలోని తెలుగుగంగ ప్రధాన కాలువలో నీటి ప్రవాహన్ని పరిశీలించారు. దైవ దర్శనానికి వచ్చిన భక్తులు తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లకుండా పోలీసు సిబ్బందితో పర్యవేక్షిస్తామన్నారు. అలాగే కాలువ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్ఐ రమేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

దొర్నిపాడు: బాల్యం అనేది భగవంతుడు ఇచ్చిన అమూల్యమైన వరం అని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు సూచించారు. గురువారం పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం బాలబాలికలకు బహుమతులు అందజేశారు.

శిరివెళ్ల: మండలంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, కళాశాలలో బాలల దినోత్సవం ప్రాముఖ్యతను టీచర్లు విద్యార్థులకు వివరించారు. నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏంఈఓ శంకర ప్రసాదు పాల్గొన్నారు. రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా, ప్రిన్సిపాల్ ఇంద్రావతి, కరస్పాండెంట్ సురేంద్ర నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం:మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఉపాధ్యాయ బృందంతో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే చిన్నకంబలూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ కేంద్ర చిన్నారులతో పాటు గ్రామంలోని 6,7,8 తరగతుల బాలికలకు హక్కులపై వివరించారు.

చాగలమర్రి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పీఎంసీ చైర్మన్ గౌస్, ఇన్‌చార్జ్ హెచ్ఎం ఐడీకే శాస్త్రి, ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గేయాలు, కోలాటంలో పీరమిడ్లు ఆహుతులను అలరించాయి.



బహుమతులు అందజేస్తున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థి దశ నుంచే విద్యార్థులను రెడ్‌క్రాస్‌లో భాగస్వాములు చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాసరచన , ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండే సేవా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, ట్రెజరర్ నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఉస్మాన్‌బాషా, మద్దిలేటి, ఆనంద్‌గురూజీ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

క్యాన్సర్ నిర్మూలనకు సహకరించండి

రుద్రవరం: క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నర్సాపురం,ఆలమూరు పీహెచ్‌సీల వైద్యులు బాబు,గాయత్రి, అమర్నాథ్‌రెడ్డి, కోరారు.ఆయా పీహెచ్‌సీల పరిధిలో గురువారం ఇంటింటి సర్వే ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్స రాలు నిండిన ప్రతి ఒక్కరూ రొమ్ము,నోటి,గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ఉచితంగానే పరీక్షలు చేస్తారని చెప్పారు.



ఆలమూరులో ఇంటింటి స్క్రీనింగ్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్-17 విభాగంలో మహమ్మద్ అఫ్రిది, అండర్-14లో చిట్టికళ, ఖోఖో అండర్-14 విభాగంలో దేవిక, సెపక్‌తక్రా అండర్-14 విభాగంలో అనూష, మాధవి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. సాఫ్ట్‌బాల్ అనంతపురం, ఖోఖో పల్నాడు, సెపక్‌తక్రా విజయవాడలో ఈనెల 23 నుంచి 25వ తేదీవరకు నిర్వహిస్తారని, అందులో తమ విద్యార్థులు పాల్గొంటారని



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెప్పారు. పీడీ దేవేంద్రను అభినందించారు. ఉపాధ్యాయులు జయలక్ష్మి, చెన్నయ్య, రవిప్రకాశ్, బాలకోటిరెడ్డి, మౌలాలి, నాగరాజు, రమణయ్య, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక డిపోలకు లైసెన్స్‌ల మంజూరు

- 20 మంది దరఖాస్తు చేసుకుంటే నలుగురికే అర్హత
- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున ఇసుక వినియోగదారుల సౌలభ్యం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రైవేటు వ్యక్తులకు ఇసుక డీలర్ లైసెన్సులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇసుక డిపోల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డిప్ పద్ధతి ద్వారా నిర్ధారించేందుకు నిర్వహించిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో వినియోగదారులకు సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ చేసేందుకు మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఈ మేరకు జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున నం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ద్యాల, బనగానపల్లి, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఇసుక నిల్వ కేంద్రాల ఏర్పాటు నిమిత్తం పత్రికా ప్రకటన ఇచ్చి ఇసుక డీలర్ షిప్‌లకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఇందులో భాగంగా నంద్యాల నియోజకవర్గంలో 20 మంది దరఖాస్తు చేసుకోగా నలుగురు మాత్రమే డిప్పు ద్వారా ఎంపిక చేసేందుకు అర్హత పొందారన్నారు. నంద్యాల ఇసుక డిపో షేక్ అబ్దుల్ కుద్దూస్‌కు, బనగానపల్లెలో మద్దూరు రవికి, ఆళ్లగడ్డ ఇసుక డిపో రామ్‌శేఖర్ రెడ్డికి, నందికొట్కూరు ఇసుక డిపో బాలవెంకట సురేష్‌కు దక్కడంతో లైసెన్స్‌లు మంజూరు చేశామన్నారు. ఇసుక నిల్వ కేంద్రాల్లో ప్రతిరోజు కనీసం ఐదు టన్నుల ఇసుక నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, గుంతలు పూడ్చడం, గృహ నిర్మాణాలకు ఇసుక పెద్ద మొత్తంలో అవసరం అవుతుందని ఈ మేరకు వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో ఇసుక నిల్వ ఉంచుకోవాలని చెప్పారు. ఇసుక నిల్వ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నిరంతరం నిఘా ఉంచుకోవాలన్నారు. నంద్యాల, బనగానపల్లెలో టన్ను ఇసుక రూ.884, ఆళ్లగడ్డలో టన్ను ఇసుక రూ.719, నందికొట్కూరులో టన్ను ఇసుక రూ.744 చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన ధరకే వినియోగదారులకు విక్రయించాలని సూచించారు. కమిటీ సభ్యులు భూగర్భ గనుల శాఖ ఏడీ వేణుగోపాల్, ఆర్డీఓ విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, గ్రౌండ్ వాటర్ డీడీ రఘురాం, డీపీఓ జమీవుల్లా, ఆర్డీఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ఆళ్లగడ్డ: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ అధికారిణి అరుణకుమారి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అబ్దుల్ రహీం తదితరులున్నారు

ఉయ్యాలవాడ : మాజీ ప్రధానమంత్రి డాక్టర్ జవహర్‌లాల్ నెహ్రూను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ షరీఫ్, గ్రంథాలయాధికారిణి సంగీత లక్ష్మి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో, మాయలూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దొర్నిపాడు: స్థానిక గ్రంథాలయంలో జ్ఞానం ప్రసాదించే పుస్తకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రామచంద్రయ్య కోరారు. గురువారం స్థానిక గ్రంథాలయాధికారి అఖిలాబేగం ఆధ్వర్యంలో వారోత్సవాలను ప్రారంభించారు.

ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థి వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యమాల ద్వారా గుణపాఠం చెబుతామని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ అధ్యక్షతన సంఘం నంద్యాల జిల్లా ప్రథమ మహాసభను ఘనంగా నిర్వహించారు. పద్మావతినగర్ నుంచి మున్సిపల్ టౌన్ హాల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన



అభివాదం తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పథకం అమలు చేయాలని, నంద్యాల జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ, మహిళా డిగ్రీ కళాశాల, టీటీసీ, బీఈడీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు సురేష్, ఎర్రిస్వామి, ఉదయ్, ఏఐవైఎఫ్ మాజీ నాయకులు బాబాఫక్రుద్దీన్, బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఉద్యమ రథసారధిగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనుంజయుడును రెండో సారి ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి నిర్ణయాలు తీసుకోవాలి



గ్రామాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

ఆళ్లగడ్డ: గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి నిర్మాణాత్మకంగా ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ మహబూబ్ ఖాన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యాశాఖ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

దొర్నిపాడు: గ్రామాభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సులోచన సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, సర్పంచులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రభుత్వ పథకాలపై అధికారులు, సిబ్బందికి అవగాహన అవసరమని ఎస్ఆర్‌డీ కన్సల్‌టెంట్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ఏంపీడీఓ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలకు గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ శివమల్లేశప్ప, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండంగా శిక్షణ కార్యక్రమాన్ని డీఎల్‌పీఓ రాంబాబు తనిఖీ చేశారు.

గోస్పాడు: గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే పనులను నిర్వహించాలని మండల పరిషత్ అధ్యక్షుడు ఆర్ధర్‌సైమాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు ఒక్కరోజు శిక్షణ సమావేశం నిర్వహించారు.

ఉయ్యాలవాడ: గ్రామాలభివృద్ధి కోసం సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పని చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళిక అంశంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

చాగలమర్రి: పంచాయితీల అభివృద్ధికి మండల, గ్రామ ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో ఎపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన అభివృద్ధి ప్రణాళిక ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

పంట కోత ప్రయోగం

రుద్రవరం: చిత్రేనిపల్లెలో గురువారం వ్యవసాయాధికారులు వరిలో పంట కోత ప్రయోగం చేశారు. ఏఓ నాగేంద్ర ప్రసాదు మాట్లాడుతూ భూలక్ష్మి అనే రైతు పొలంలో వరి పంట కోత ప్రయోగం చేశామన్నారు. నిర్ణీత కొలతల ప్రకారం వరి కోతకోయించగా ఎకరాకు దాదాపు 45 బస్తాల దిగుబడి రావచ్చని తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నంద్యాల(న్యూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం కార్యదర్శి పుల్లా నరసింహులు, కార్యవర్గ సభ్యులు నాగరాజు విమర్శించారు. గురువారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వినతి పత్రాన్ని డీఆర్ఓ రాంనాయక్‌కు అందజేశారు. గౌస్, శివ, జైలాన్, హరి, సాయి, పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించండి

ఉయ్యాలవాడ : పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలకు సంతకాలు నేర్పించాలని వయోజన విద్య సూపర్‌వైజర్ భాస్కర్‌రెడ్డి వీఓఏలకు సూచించారు. గురువారం స్థానిక మోడల్‌స్కూల్‌లో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీఓఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, సీసీ గంగన్న పాల్గొన్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

శిరివెళ్ల: వచ్చే ఏడాది మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ విజయబాబు తెలిపారు. గురువారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి 9,515 ఇళ్లు మంజూరు కాగా ఇంతవరకు 5,586 నిర్మాణాలు పూర్తయ్యాన్నారు. మరో 1,266 ఇళ్ల నిర్మాణాలు పునాదిస్థాయి, 388 గృహాలు వాకిలి దశ, 328 ఇళ్లు పైకప్పు దశలో ఉన్నాయన్నారు. ఇంతవరకు రూ.115 కోట్ల బిల్లులను లబ్ధిదారులకు చెల్లించామని వివరించారు. అలాగే 2014-19 మధ్య కాలంలో వివిధ దశల్లో ఉన్న 45 వేల ఇళ్ల నిర్మాణాలపై సర్వే పూర్తయ్యిందని, బిల్లుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని



ఇళ్ల నిర్మాణాల రికార్డులను పరిశీలిస్తున్న డీఈ విజయబాబు

చెప్పారు. కార్యక్రమంలో ఏఈ అహమ్మద్ బాషా పాల్గొన్నారు.

108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): 108 సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కోరారు. 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి దిగుతామంటూ ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ రామసంజీవరావుకు గురువారం వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. వెంకటరామిరెడ్డి, తిరుపాల్, జుబేర్, ఖాశీంఖాన్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: 108 కాంట్రాక్టు ఉద్యోగల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జీవన్, బాలయ్య, శేఖర్ ఎంపీడీఓ సులోచన, ఏఓ నారాయణ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ మాధవ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 108 సర్వీసులను నేరుగా రాష్ట్రప్రభుత్వమే నిర్వహించాలన్నారు. స్లాబ్‌ల ప్రకారమే వేతనాలు అందించి ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేయాలన్నారు.



డీటీ రామసంజీవరావుకు వినతి పత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

ఆళ్లగడ్డ: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని 108 ఉద్యోగులు నాగార్జునరెడ్డి, భార్గవ్, నాగేంద్ర తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని గురువారం తహసీల్దార్ రత్నకుమారికి నోటీసు అందజేశారు.

గోస్పాడు: 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏసయ్య కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం అన్ని మండల కేంద్రాల్లోని ఎంపీడీఓలు, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. నంద్యాలలోని డీఎంఅండ్‌హెచ్ఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈఎంటీలు తిమ్మయ్య, దినేష్, పైలెట్లు చెన్నయ్య, రంగన్న పాల్గొన్నారు.

రుద్రవరం: 108 వాహన ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వమే పరిష్కరించాలని భైరం ప్రసాదు,ముత్తలూరు శ్రీనివాసులు,లుక్కు శ్రీనివాసులు,సురేంద్ర కోరారు. గురువారం సమస్యల పరిష్కారం కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు మల్లికార్జున రావుకు అందజేశారు.

జూదరుల అరెస్టు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె సమీపంలో గురువారం ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాదు తెలిపారు. గ్రామ సమీపంలోని దర్గా వద్ద ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేయగా శాంసంగ్, మురళి,జమాల్‌బాషా,చిన్న ఓబులేసు, మల్లెల ఓబులేసు పట్టుబడ్డారని వారి నుంచి రూ.6,560 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామానికి చెందిన రామచంద్రుడు అనే వ్యక్తి నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాదు గురువారం తెలిపారు. కొంత కాలంగా అనుమతులు లేకుండా మద్యం సీసాలు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా మద్యం సీసాలతో నిందితుడు పట్టుబడ్డాడని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.